సాక్షి
రంగారెడ్డి
బుధవారం । 27 । మార్చి । 2024





## టిప్పర్‌తో ఢీకొట్టి..

మద్యం మత్తులో టిప్పర్‌ను వేగంగా నడిపిన డ్రైవర్ ఓ బాలుడి ప్రాణాలను పొట్టన పెట్టుకున్నాడు. 8లో▸



## తాళం వేసిన ఇళ్లే టార్గెట్

రోడ్డుకు సమీపంలో ఉన్న ఇళ్లన ఎంచుకుంటారు. తాళం వేసిన ఇళ్లను వెతికి మరీ టార్గెట్ చేస్తారు. 8లో▸

## రంజాన్ వేళలు

| ఇఫ్తార్ : | సహర్ : |
|---|---|
| బుధవారం సాయంత్రం 6:35 | గురువారం ఉదయం 4:51 |

## న్యూస్‌రీల్

### మోతాదు మించితే చర్యలు

- ఐపీఎం డైరెక్టర్ శివలీల
- బాటసింగారం మామిడి మార్కెట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీ



బాటసింగారం మామిడి మార్కెట్‌లో తనిఖీలు చేస్తున్న ఐపీఎం డైరెక్టర్ శివలీల

**అబ్దుల్లాపూర్‌మెట్:** మామిడి పక్వానికి అధికారులు సూచించే రసాయనాలను అనుమతులకు మించి వినియోగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం) డైరెక్టర్ శివలీల హెచ్చరించారు. మంగళవారం ఆమె బాటసింగారంలో కొనసాగుతున్న గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్‌లోని మామిడి యార్డులో మంగళవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు విజయ్‌కుమార్, జీఎల్‌ఎన్‌రెడ్డి, ఖలీల్‌లతో కలిసి ఆకస్మిక తనఖీ చేపట్టారు. ఈ సందర్భంగా యార్డులోని మామిడి ప్యాకింగ్ కేంద్రాలను పరిశీలించారు. మోతాదుకు మించి ఇథిలిన్ ప్యాకెట్లను వినియోగించకూడదని ఆమె హెచ్చరించారు. ప్యాకింగ్ చేసే హమాలీలకు, వ్యాపారులకు రసాయన వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ తనిఖీల్లో ఖరీదుదారుడైన కుమార్ అగర్వాల్ అదనంగా ఇథిలీన్ ప్యాకెట్లు వేసి మామిడి ప్యాకింగ్ చేస్తున్న విషయాన్ని గమనించి 37 బాక్సులను సీజ్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ సెక్రెటరీ చిలుక నర్సింహారెడ్డి, యార్డ్ ఇన్‌చార్జి ఎస్‌ఎ లబాన్, సూపర్‌వైజర్లు మురళీధర్, ధర్మేంద్ర, డీఓలు నాయక్, ఉదయ్, కిరణ్, సునీత్, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రికి సన్మానం



సీఎం రేవంత్‌రెడ్డితో ఆగిరెడ్డి దంపతులు

**చేవెళ్ల:** సీఎం రేవంత్‌రెడ్డిని చేవెళ్ల మాజీ సర్పంచ్ బండారి శైలజ, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం చేవెళ్ల నియోజకవర్గ ముఖ్య నాయకులతో పార్లమెంట్ ఎన్నికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సీఎంను సన్మానించారు.

### ఉప్పల్ ఉర్రూతలే!

**ఉప్పల్/సాక్షి, సిటీబ్యూరో:** ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో బుధవారం జరిగే ఐపీఎల్ మ్యాచ్‌కు భారీ భద్రతను ఏర్పాటు చేసినట్లు రాచకొండ సీపీ తరుణ్ జోషి తెలిపారు. మల్కాజిగిరి డీసీపీ పద్మజ, ట్రాఫిక్ డీసీపీ మనోహర్, ట్రాఫిక్ ఏసీపీ చక్రపాణిలతో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

**3 గంటల ముందుగానే రావచ్చు..**

- సాయంత్రం 7.30గంటలకు ప్రారంభమయ్యే మ్యాచ్‌కు 3 గంటల ముందే ప్రేక్షకులను స్టేడియంలోకి అనుమతిస్తాం.
- స్టేడియంలోకి ఎలాంటి వస్తువులను తీసుకురావద్దు. కారు పాస్ ఉన్నవారు రామంతాపూర్ నుంచి రావాలి. ఫిజికల్ చాలెంజెస్ వ్యక్తులు గేట్–3 ద్వారా వెళ్లాలి.



# కరువు.. దరువు

అడుగంటిన భూగర్భజలాలు • తడులు అందక నెర్రలు బారుతున్న పొలాలు

### వరి.. పశుగ్రాసంగా మారి

పక్క ఫొటోలో ఎండిన వరిపైరును మేపుతున్న రైతు గట్టుఇప్పలపల్లికి చెందిన ఎట్టి రాజు. బోరు కింద ఎకరా పొలంలో వరి సాగు చేశాడు. వరి పొట్టదశకు చేరుకుంది. అప్పుల బాధలు తొలుగుతాయని ఆశించారు. కానీ నెల క్రితం ఒక్కసారిగా భూగర్భజలాలు అడుగంటి నీటి మట్టం పడిపోవడంతో బోరు ఆగుతూ పోస్తోంది. దీంతో సరిపడ తడి అందక పంట పూర్తిగా ఎండిపోయి పశుగ్రాసమైందని కన్నీటి పర్యంతమయ్యాడు. అప్పులు ఎలా తీర్చాలంటూ ఆవేదన వ్యక్తం చేశాడు.
– తలకొండపల్లి

### ఆరు బోర్లు.. 13 ఎకరాలు

ఆరు బోర్లు.. 13 ఎకరాల్లో సాగు. ఎరువులు, దున్నకాలు కలుపుకొని రూ.4లక్షల వరకు ఖర్చు చేసి వరి సాగు చేపట్టాడు మండల పరిధిలోని తిప్పాయిగూడకు చెందిన రైతు జెనిగె జంగయ్య. వర్షాభావంతో పాటు ఒక్కసారిగా ఆరు బోర్లు వట్టిపోవడంతో ఆ రైతు నెత్తికి చేతులు పెట్టాడు.
– మంచాల



ఎండిన పంటను చూపుతున్న రైతు జంగయ్య దంపతులు

పొట్టకొచ్చిన పంటలకు సరిపడా నీరందక రైతు పొట్టగొడుతున్నాయి. ఆరుగాలం శ్రమించినా అన్నదాతకు ఆవేదనే మిగులుతోంది. అప్పులు తీరుతాయని సంతోషించిన ఆశలు నెర్రలుబారుతున్నాయి.

| షాబాద్ మండలంలో పంటల వివరాలు | |
|---|---|
| పంట | ఎకరాల్లో |
| వరి | 22వేలకు పైగా |
| మొక్కజొన్న | 589 |
| కూరగాయలు, పూలు | 2,500 |

**షాబాద్:** భూగర్భజలాలు అడుగంటడంతో యాసంగి పంటలు ఎండిపోతున్నాయి. నీరు లేక పంట పొలాలు నెర్రలు బారుతున్నాయి. బోర్లు వట్టి పోయి సరిపడా సాగు నీరందడం లేదు. పంట కాపాడుకునేందుకు కలుపు తీయించి, ఎరువులు, మందులకు ఖర్చు చేసి తీరా పంట చేతికొచ్చే సమయానికి బోర్లు ఆగి పోస్తుండడంతో రైతు దిక్కుతోచక పశువులు మేపుతున్నాడు. పెట్టుబడి సైతం వచ్చేలా లేదని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలి గగ్గోలు పెడుతున్నారు.

**కోతల సమయంలో కొత్తబోర్లు**

మండల పరిధిలో బోరుబావులపై ఆధారపడే పంట సాగు చేస్తున్నారు. భూగర్భ జలాలు తగ్గి ఈ నెలలోనే కొన్ని బోర్లు వట్టిపోయాయి. మరి కొన్ని ఆగుతూ.. సన్ననిధారలా వస్తున్నాయి. దీంతో మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే సరిపడా తడులు అందడం లేదు. పరిస్థితి ఇలాగే ఉంటే 15 నుంచి 20 రోజుల్లో పంటలన్నీ ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరి పొలాలు నాటిన తర్వాత చలి తీవ్రత కారణంగా పొలాలు సరిగా ఎదగలేదు. చీడ పీడల ఉధృతితో తీవ్ర నష్టం వాటిల్లింది. కాపాడుకున్న పంట కోతకు వచ్చే సమయంలో తమకు శోకం మిగిలిస్తున్నాయని రైతులు గుండెలు బాదుకుంటున్నారు. కొందరు రైతులు కొత్త బోర్లు వేయిస్తున్నారు. వేయి ఫీట్ల వరకు వేయించినా చుక్క నీరు వస్తలేదు. ప్రభుత్వం స్పందించి తమకు పరిహారం అందజేయాలని కోరుతున్నారు.

### పంట దెబ్బతిన్న గ్రామాలు

కుర్వగూడ, కక్కులూర్, సర్దార్‌నగర్, అంతారం, నరెడ్లగూడ, మద్దూరు, లింగారెడ్డిగూడ, సాయిరెడ్డిగూడ, నాగర్‌గూడ, తాళ్లపల్లి, తిమ్మారెడ్డిగూడ, తిర్మలాపూర్ తదితర గ్రామాల్లో భూగర్భజలాలు తగ్గుముఖం పట్టాయి. కుర్వగూడ, కక్కులూర్, నరెడ్లగూడ, తాళ్లపల్లి గ్రామాల్లో వందల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి.



కుర్వగూడలో నెర్రెలు బారిన పంట

### బోర్లు వట్టిపోతున్నాయి



బోరు బావిలో నీరు తగ్గడంతో గంటకు ఒకసారి వెళ్లి బోరు ఆన్‌చేస్తున్నాం. రెండున్నర ఎకరాల్లో వరి పంట సాగు చేశాను. మరో 25 రోజుల పాటు నీరు అవసరం. ఇప్పుడే బోర్లు వట్టిపోతున్నాయి.
– హబీబ్, రైతు, నాగర్‌గూడ

### పంట ఎండుతోంది



మూడు ఎకరాలలో వరి సాగు చేశా. పదేళ్లుగా బోరు నుంచి సమృద్ధిగా నీళ్లు లభించాయి. కరువు ఉండదని యాసంగిలో పొలం సాగుచేసిన. 15 రోజులుగా బోరు నీళ్లు తక్కువగా పోస్తోంది. వేసిన పంట ఎండిపోతోందని ఆందోళనలో ఉన్నాం.
– అచ్చిని పర్వతాలు, రైతు, అంతిరెడ్డిగూడ

### ఏడుపే మిగిలింది



రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నా. మొదట్లో పంట మంచిగా వచ్చింది. రెండు, మూడు తడుల్లో పంట చేతికి వచ్చేది. బోరు వట్టి పోవడంతో పంటను పశువులకు మేపుతున్న. ఏడువు తప్ప ఏమీ మిగిలేలాలేదు.
– సావిత్రి, రైతు, దేవునిపడకల్

### ఎకరా పంట ఎండింది



రెండెకరాల్లో వరి సాగు చేశా. పంట పొట్టకు వచ్చే దశలో బోర్‌లో నీట్టి మట్టం పడిపోయింది. ఇప్పటికే ఎకరా పంట ఎండింది. మరో ఎకరం కూడా ఎండిపోతోంది. చెరువు మరమ్మతు చేయకే ఈ పరిస్థితి దాపురించింది. అధికారులు స్పందించాలి.
– పద్మనాభాచార్యులు, రైతు, దేవుని పడకల్

### పంట.. కాపాడుకుంటా

తిప్పాయిగూడకు చెందిన మరో రైతు జెనిగె సత్తయ్య రూ.5లక్షల పెట్టుబడితో 14 ఎకరాల్లో వరిసాగు చేశాడు. వేసవి తాపానికి భూగర్భ జలాలు అడుగంటి బోర్లలో నీరు తగ్గింది. దీంతో ఆయన పంటను కాపాడుకునేందుకు ట్యాంకర్లతో నీరు పారిస్తున్నాడు. ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలని వేడుకుంటున్నాడు. – మంచాల



ట్యాంకర్‌తో పొలానికి తడులు పారిస్తున్న రైతు సత్తయ్య

### శాపంగా మారిన ఆయకట్టు కుదింపు

**తలకొండపల్లి:** మండల పరిధిలోని దేవుని పడకల్ గ్రామంలో యాసంగిలో పంట సాగు చేసిన అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వరి, మొక్కజొన్న పంటలకు నీటి తడులను అందించలేక రైతులు ఆందోళన చెందుతున్నుఆరు. గ్రామంలో 30 ఎకరాల విస్తీర్ణం ఉన్న మమత్‌ఖాన్ చెరువు పూర్తి వట్టిపోయింది. నాలుగేళ్ల క్రితం కట్ట తెగితే తాత్కాలిక నిర్మాణం చేపట్టారు. దీంతో చెరువు విస్తీర్ణం తగ్గి భూగర్భ జలాలు సైతం అడుగంటాయి. గతంలో ఈ ఆయకట్టు నుంచి 80 ఎకరాలకు సాగునీరు అందేది ప్రస్తుతం దీన్ని 18 ఎకరాలకు కుదించారు. గతంలోని పాటు కాల్వసైతం కనుమరుగైంది. బోర్లలోనూ నీటి మట్టం తగ్గి ఆగిపోస్తున్నాయి. సుమారు 220 ఎకరాల్లో పంటలు దెబ్బ తిని రూ.2 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. కళ్ల ముందే పంటలు ఎండి పోవడంతో రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. చేసేదేమి లేక సాగు చేసిన పంటల్లో పశులు మేపుతున్నారు.



మొక్కజొన్న పంటలో పశువులు మేపుతున్న మహిళా రైతు

# ‘సెంటిమెంట్’.. కంటిన్యూ

### జిల్లా వేదికగా జాతీయ స్థాయి గ్యారంటీలు

- ఏప్రిల్ ఆరు లేదా ఏడు తేదీల్లో ‘జనజాతర’
- కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుతోనే చేవెళ్ల అభివృద్ధి
- ముఖ్య నేతల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి



మాట్లాడుతున్న చేవెళ్ల ఎంపీ, కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, చిత్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**సాక్షి, రంగారెడ్డి జిల్లా:** తుక్కుగూడ వేదికగా ఎన్నికల శంఖారావం పూరించేందుకు కాంగ్రెస్ సన్నాహాలు చేస్తోంది. ఏప్రిల్ ఆరు లేదా ఏడు తేదీల్లో భారీ బహిరంగ సభను నిర్వహించి, జాతీయ స్థాయి గ్యారంటీలను ప్రకటించాలని నిర్ణయించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సెప్టెంబర్ 17న ఇదే వేదిక నుంచి కాంగ్రెస్ అధిష్ఠానం ఆరు గ్యారంటీలను ప్రకటించిన విషయం విదితమే. ఆ తర్వాత ఆ పార్టీ అనూహ్య విజయం సాధించి, తెలంగాణలో అధికారాన్ని హస్తగతం చేసుకుంది. కాంగ్రెస్ ఇప్పటి వరకు ఏ కార్యక్రమం చేపట్టినా చేవెళ్ల నుంచి ప్రారంభించడం అనవాయితీగా వచ్చేది. ఇది కలిసి వస్తుందని ఆ పార్టీలో నమ్మకం. ఇదే సంప్రదాయాన్ని జాతీయ స్థాయిలోనూ కొనసాగించాలని నిర్ణయించింది. తాజాగా మంగళవారం చేవెళ్ల పార్లమెంట్ నియోజవర్గం ముఖ్య నేతలతో పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. చేవెళ్ల లోక్‌సభ స్థానంలో పార్టీ అభ్యర్థి గెలుపు సహా జనజాతర సభపై చర్చించారు. ఏఐసీసీ నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే హాజరు కానుండటంతో ఈ సభను పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. భారీ జనసమీకరణకు ఏర్పాట్లు చేస్తోంది.

**రంజిత్ గెలుపుతోనే..**

సర్వేల ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక జరిగింది. చేవెళ్ల పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి ఎంతో సౌమ్యుడని, ఆయన అందరితో కలివిడిగా ఉంటారు. మంచి గుర్తింపు కూడా ఉంది. ఆయన గెలుపు కోసం పార్టీ కేడర్ అంతా కలిసికట్టుగా పని చేయాలి. ఇందు కోసం బంధుత్వాలను సైతం పక్కన పెట్టాలి. చేవెళ్ల అభివృద్ధి రంజిత్ గెలుపుపైనే ఆధారపడి ఉంది. కష్టపడి పని చేసిన నేతలను పార్టీ ఎప్పటికీ మర్చిపోదు. ఇలాంటి వారికి సరైన సమయంలో సముచిత స్థానం కల్పిస్తుంది. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి మహేశ్వరం టికెట్ ఆశించారు. అది దక్కక పోయినా..నిరుత్సాహపడలేదు. కష్టపడి పని చేశారు. పార్టీ ఆయనకు నామినేటెడ్ పోస్టును కట్టబెట్టి గౌరవించింది’ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జిలు, మండల, మున్సిపాలిటీ, గ్రామ కమిటీలు కలిసి పని చేయాలని కోరారు. ఇదిలా ఉంటే అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమావేశంలో పాల్గొనడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. రాజ్యాంగబద్ధ పదవిలో కొనసాగుతున్న వ్యక్తి పార్టీ సమావేశానికి ఏ విధంగా హాజరవుతారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతుండటం కొసమెరుపు.

### కేఎల్ఆర్ హాట్ కామెంట్స్

‘కష్టకాలంలో పార్టీని, కార్యకర్తలను రోడ్డున వదిలేసి వెళ్లిన వాళ్లను మళ్లీ పార్టీలోకి ఎలా ఆహ్వానిస్తారు..? ఒకసారి మోసం చేసిన వాళ్లను మళ్లీ ఎలా తీసుకుంటారు..? ఇతర పార్టీల్లోని నేతల కోసం గేట్లు తెరిచామని పదేపదే చెబుతున్నారు. ఏళ్ల తరబడి పార్టీ జెండాను భుజానికెత్తుకుని పని చేస్తున్న సామాన్య కార్యకర్తలు ఏమై పోవాలి..? అవకాశాలన్నీ పారాచూట్ లీడర్లు తన్నుకు పోతుంటే..? మాలాంటి సామాన్య కార్యకర్తలు ఎటు పోవాలి? మేం బతుకాల్నా ..? చావాల్నా..? గతంలో బీఆర్ఎస్ నేతలు చేసిన తప్పులే ప్రస్తుతం కాంగ్రెస్ పెద్దలు చేస్తున్నారు? ఇది ఎంత వరకు కరెక్ట్..? పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ.. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలను విస్మరించడం ఎంత వరకు సమంజసం’..? అంటూ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ సీఎం రేవంత్‌రెడ్డి ముందే ఆవేదన వ్యక్తం చేయడం పార్టీలో కలకలం సృష్టించింది. గతంలో పార్టీకి ద్రోహం చేసిన నేతలను మళ్లీ పార్టీలోకి ఎలా చేర్చుకుంటారని ఆయన నిలదీశారు. ‘ఇతర పార్టీల్లోని నేతలను పార్టీలోకి చేర్చుకునేందుకు గేట్లు తెరిచినట్లు పార్టీ పెద్దలు పదేపదే చెబుతుండటం ఇబ్బందికరంగా ఉంది. వారి దాష్టీకానికి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఆర్థికంగా, రాజకీయంగా నష్టపోయారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు కాకుండా పారాచూట్ లీడర్లకు టికెట్లు ఇవ్వడాన్ని క్షేత్ర స్థాయి కేడర్ జీర్ణిం చుకోలేక పోతోంది’ అని ఆయన చెప్పడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

# విధులకు 16,536 మంది సిబ్బంది

### కలెక్టర్ నేతృత్వంలో మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

**సాక్షి, రంగారెడ్డిజిల్లా:** పార్లమెంటు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా మంగళవారం పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక నేతృత్వంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఎన్ఐసీ హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు (పీఓ), సహాయ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీఓ)లను, ఇతర పోలింగ్ అధికారులు (ఓపీఓ)లను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. రిజర్వ్ సిబ్బందిని కలుపుకొని జిల్లా పరిధిలోని ఎనిమిది సెగ్మెంట్లకు మొత్తం 16,536 మంది పోలింగ్ సిబ్బందిని నియమిస్తూ ర్యాండమైజేషన్ చేశారు. వీరిలో పీఓలు 4,076 మంది ఉండగా, ఏపీఓలు 3,968, ఓపీఓలు 7,952 మంది, మైక్రో అబ్జర్వర్లు 540 మంది ఉన్నారు. వీరికి ఏప్రిల్ ఒకటి, రెండు తేదీల్లో నిపుణులతో శిక్షణ ఇప్పించనున్నట్లు కలెక్టర్ వివరించారు. ఇది దృష్టిలో ఉంచుకొని పోలింగ్ విధుల కోసం నియమించబడిన సిబ్బందికి తక్షణమే ఉత్తర్వులతో పాటు ఫామ్–12 ను అందజేయాలని అధికారులను ఆదేశించారు.

**పకడ్బందీగా పోస్టల్ బ్యాలెట్స్ నిర్వహణ**

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో పార్లమెంటు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బందికి, అత్యవసర సేవల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఇచ్చే ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించేందుకు పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు, సిబ్బందికి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ శశాంక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ఎవరికి వస్తుందనేదీ అధికారులకు స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో ఎన్నికల రోజున విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి, ఈ ప్రక్రియలో పాల్గొనే పోలింగ్ సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి, సర్వీస్ ఓటర్లకు ఫారం 12 అందించి దరఖాస్తు చేసుకున్న ఓటర్లకు ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్లో ఓటింగ్ వేసేవిధంగా ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడానికి వచ్చే ఇతర జిల్లా, ప్రాంత సిబ్బందికి ఒక రోజు స్పెషల్ క్యాజువల్ లీవ్ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్ఓ సంగీత, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి కృష్ణారెడ్డి, చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం, తహసీల్దార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### వందశాతం పన్ను వసూలు

డీఎల్‌పీఓ సతీశ్‌రెడ్డి

**చేవెళ్ల:** ఈనెలాఖరు వరకు అన్ని పంచాయతీల్లో ఇంటి పన్నులు వందశాతం వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలను జారీ చేసినట్లు చేవెళ్ల డివిజన్ డీఎల్‌పీఓ సతీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. ఎంపీఓ విఠలేశ్వర్‌జీ, పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రెడ్డితో పన్ను వసూళ్లపై చర్చించారు. ప్రజలు పన్నులు చెల్లించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

| పన్ను వసూలు వివరాలు | | |
|---|---|---|
| మండలం | లక్ష్యం | వసూలైంది |
| చేవెళ్ల | రూ.1.91 కోట్లు | రూ.1.62కోట్లు |
| షాబాద్ | రూ.1.3కోట్లు | రూ.82.44లక్షలు |
| మొయినాబాద్ | రూ.4.57కోట్లు | రూ.3.51కోట్లు |
| శంకర్‌పల్లి | రూ.3.57కోట్లు | రూ.2.63కోట్లు |



ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ

## క్లుప్తంగా

### 30న తైబజార్ వేలం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం తైబజార్ వేలాన్ని తిరిగి 30వ తేదీన నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ తెలిపారు. పట్టణంలోని రోడ్డుపై రోజువారి మార్కెట్, బుధవారం జరిగే సంత ఫీజులు వసూలు చేసే హక్కులను తైబజార్ ద్వారా వేలంలో ఎవరైనా దక్కించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 22న నిర్వహించిన తైబజార్ వేలంలో పాల్గొనేందుకు నిర్ణీత డీడీలు ఎవరూ చెల్లించకపోవడంతో ఈ వేలం వాయిదా పడిందని గుర్తు చేశారు. తిరిగి శనివారం మధ్యాహ్నం 2 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. నిర్ణీత డీడీలు చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

### క్రషర్ క్వారీలో పడి యువకుడి మృతి


సాయి (ఫైల్)

కొందుర్గు: క్రషర్ క్వారీలో పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన కొందుర్గు మండలం గంగన్నగూడ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుండ్లకాడి సాయి(26) మంగళవారం స్నేహితులతో కలిసి మండలంలోని గంగన్నగూడ సమీపంలోని ఓ క్రషర్ క్వారీలో ఈత కొట్టేందుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు సాయి క్వారీలో పడి చనిపోయాడు. స్థానికులు మృతదేహాన్ని వెలికితీశారు. ఈ విషయంలో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికులు, మృతుడి కుటుంబ సభ్యులు మృతదేహంతో రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. ఎస్‌ఐ కృష్ణయ్య సంఘటన స్థలానికి చేరుకొని ధర్నాను విరమింపజేశారు. మృతుడి తండ్రి నర్సింలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



# రోడ్డు పక్కన తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- 30 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం
- ఇద్దరి రిమాండ్, పరారీలో ముగ్గురు
- వివరాలు వెల్లడించిన శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి


స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను పరిశీలిస్తున్న డీసీపీ

షాద్‌నగర్ రూరల్: రోడ్డుకు సమీపంలో ఉన్న ఇండ్లే ఎంచుకుంటారు. తాళం వేసిన ఇళ్లను వెతికి మరీ టార్గెట్ చేస్తారు. ఈ పనిలో అంతర్రాష్ట్ర ముఠాలు ముందు వరుసలో ఉంటారు. పగలు రెక్కీ నిర్వహించి రాత్రి వేళల్లో కన్నం వేసి, అందిన కాడికి దోచుకొని పరారవుతారు. మంగళవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో శంషాబాద్ డీసీపీ నారాయణ రెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. మహారాష్ట్ర ఔరంగాబాద్ జిల్లా వైజాపూర్ తాలుక గోల్‌వాడికి చెందిన రజ్వీర్‌శంకర్‌పవార్, పవన్ మశ్చింద్రకాలె, నాగ్‌పూర్‌కు చెందిన అజయ్‌సర్కస్‌పవార్, ఏలవతి(మహిళ), తుల్జాపూర్‌కు చెందిన అమూల్ అలియాస్ షిండే ముఠాగా ఏర్పడ్డారు. రంగారెడ్డి జిల్లాలోని షాద్‌నగర్, ఆమన్‌గల్, కడ్తాల్, శంషాబాద్, కొత్తూరు, నందిగామ, కేశంపేట, పహాడిషరీఫ్, మహేశ్వరం, కందుకూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని వివిధ గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. ఫిబ్రవరి 1న షాద్‌నగర్ పరిధిలోని ఎలికట్ట, బుచ్చిగూడ, దూసకల్ గ్రామాల్లో చోరీలకు తెగబడ్డారు. అందుకు తాళం వేసిన ఇండ్లే టార్గెట్‌గా చేసుకొని డబ్బులు, బంగారం కాజేశారు. ఈ కేసుల్లో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆదేశాల మేరకు, శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏసీపీ రంగస్వామి పర్యవేక్షణలో షాద్‌నగర్ డీఐ రాంరెడ్డి, శంషాబాద్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ పవన్ సిబ్బందితో కలిసి దర్యాప్తు ముమ్మరం చేశారు. పోలీసులు సాంకేతిక ఆధారాలతో ఈ నెల 14న నిందితులను గుర్తించారు. ఈ కేసులో రజ్వీర్ శంకర్‌పవార్, పవన్ మశ్చింద్రకాలెను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. మరో ముగ్గురు నిందితులు అజయ్‌సర్కస్‌పవార్, ఏలవతి(మహిళ), అమూల్ అలియాస్ షిండే పరారీలో ఉన్నారు. పోలీసుల విచారణ అనంతరం నిందితుల నుంచి 30 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సైబరాబాద్ పరిధిలోని షాద్‌నగర్, ఆమన్‌గల్, కడ్తాల్, శంషాబాద్, కొత్తూరు, నందిగామ, కేశంపేట, పహాడిషరీఫ్, మహేశ్వరం, కందుకూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నిందితులపై 23 చోరీ కేసులు నమోదైనట్లు డీసీపీ వివరించారు.

**అప్రమత్తంగా ఉండండి**

రాత్రి వేళల్లో తాళం వేసిన ఇళ్లలోనే మహారాష్ట్రకు చెందిన దొంగల ముఠా చోరీలకు పాల్పడుతుందని డీసీపీ నారాయణరెడ్డి వివరించారు. చోరీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విలువైన బంగారు ఆభరణాలను, వస్తువులను, డబ్బును భద్రంగా దాచుకోవాలని సూచించారు. సాధారణ స్థలాల్లో దాచుకోకుండా ప్రత్యేక స్థలాల్లో భద్రపరుచుకోవాలన్నారు. ముఖ్యంగా బ్యాంక్ లాకర్‌లలో దాచుకోవాలని సూచించారు. రాత్రి సమయాల్లో బయట పడుకునే మహిళలు బంగారు ఆభరణాలను ధరించకుండా ఉండాలన్నారు. చోరీలపై అప్రమత్తంగా ఉంటూ అనుమానం వస్తే పోలీసులకు సమాచారం చేరవేయాలన్నారు.

**కేసును ఛేదించిన పోలీసులకు రివార్డులు**

సైబరాబాద్ పరిధిలో జరిగిన చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్న అంతరాష్ట్ర దొంగల ముఠాను పట్టుకోవడంలో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించారు. తమదైన శైలిలో దర్యాప్తు చేపట్టి సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించారు. శంషాబాద్ అడిషనల్ డీసీపీ రాంకుమార్, క్రైం డీసీపీ నరసింహ, సీసీఎస్ ఏసీపీ శశాంక్‌రెడ్డి, షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి పర్యవేక్షణలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి విచారణ అధికారిగా వ్యవహరించగా పట్టణ సీఐ ప్రతాప్‌లింగం, సీసీఎస్ సీఐలు పవన్, అవినాష్, ఏఎస్‌ఐ సత్యనారాయణరెడ్డి, హెడ్ కానిస్టేబుల్‌లు దశరథ్, మహేందర్‌కుమార్, సిబ్బంది మోహన్, యాదగిరి, జాకీర్, రాజు, రఫీ కేసును ఛేదించారు. చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులకు డీసీపీ నారాయణరెడ్డి రివార్డు అందజేసి అభినందించారు.

# టిప్పర్‌తో ఢీకొట్టి.. దూరంగా ఈడ్చుకెళ్లి

- మద్యం మత్తులో ప్రాణం తీసిన డ్రైవర్
- బాలుడు మృతి, యువతికి గాయాలు


లోకేశ్ (ఫైల్)


మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

యాచారం: మద్యం మత్తులో టిప్పర్‌ను వేగంగా నడిపిన డ్రైవర్ ఓ బాలుడి ప్రాణాలను పొట్టన పెట్టుకున్నాడు. వాహనంతో పాటు బాలుడి బాడీని కొంతదూరం లాక్కెళ్లాడు. స్థానికులు కేకలు వేయడంతో డ్రైవర్ టిప్పర్ దిగి పరారయ్యాడు. ఈ దుర్ఘటన హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆకులా మైలారం అనుబంధ గ్రామమైన మాలగూడేనికి చెందిన యువతి నందిని బ్యాంకులో పని ఉండటంతో.. ఇదే గ్రామానికి చెందిన మంత్రి రాజు, చంద్రమ్మల కుమారుడు లోకేశ్(14)ను తీసుకుని మధ్యాహ్నం 3 గంటల సమయంలో బైక్‌పై ఆకులామైలారం వెళ్తోంది. ఈ క్రమంలో ఆకులామైలారం చెరువు నుంచి మట్టిలోడుపై గుమ్మడెల్లి వైపు వెళ్తున్న టిప్పర్.. ఎదురుగా వస్తున్న లోకేశ్ బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లోకేశ్ టిప్పర్ చక్రాల కింద పడి నుజ్జునుజ్జు కాగా, యువతి స్వల్ప గాయాలతో బయటపడింది. గ్రామస్తులు ఆమెను వెంటనే ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. తమ కళ్ల ఎదుటే లోకేశ్ ప్రాణం పోవడంతో ఆగ్రహించిన స్థానికులు మృతదేహంతో రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. రాత్రి, పగలు తేడా లేకుండా టిప్పర్లు అతి వేగంగా వెళ్తున్న పట్టించుకునేవారే లేరని.. పలుమార్లు రెవెన్యూ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారండంతో సమాచారం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు ఘటనాస్థలికి చేరుకుని భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. న్యాయం చేసేంత వరకు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తీసుకెళ్లనివ్వమని భీష్మించుకున్నారు. పోలీసులు టిప్పర్ డ్రైవర్ వివరాలు సేకరించారు. ఏసీపీ రాజు బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు మీరాఖాన్‌పేట జెడ్పీహెచ్‌ఎస్‌లో 8 వ తరగతి చదువుతున్నాడు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు గ్రీన్ ఫార్మాసిటీ ఎస్‌ఐ నరేశ్ తెలిపారు.

# సమస్యల పరిష్కారమే లక్ష్యం

**జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ కార్యదర్శి శంకర్**

ఇబ్రహీంపట్నం: విద్యారంగ సమస్యల పరిష్కారమే ఎస్‌ఎఫ్‌ఐ లక్ష్యమని, దీని కోసం నిరంతర పోరాటం చేస్తుందని జిల్లా కార్యదర్శి శంకర్ పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలోని పాషనరహరి స్మారక కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. విద్యారంగాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. సకాలంలో స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. బకాయిలపై తాము ఉద్యమించనున్నట్లు తెలిపారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజు దోపిడీ రోజురోజుకు పెరుగుతున్నాయని మండిపడ్డారు.

**ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ నూతన కమిటీ..**

డివిజన్ నూతన అధ్యక్షుడిగా వంశీ, కార్యదర్శిగా తరంగ్, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్, విప్లవ్, రాకేష్, అభిలాష్, సహాయ కార్యదర్శులుగా లక్ష్మణ్, రాకేష్, వినయ్, మోబిన్‌తోపాటు కమిటీ సభ్యులను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.

# విద్యతో పాటు ఆధ్యాత్మికత ముఖ్యం

- రచయిత బొప్పన అరుణాదేవి
- కొనసాగుతున్న సభలు


మాధవీలతను సత్కరిస్తున్న నిర్వాహకులు


స్వామివారికి తులాభారం నిర్వహిస్తున్న భక్తులు

బడంగ్‌పేట్: విద్యతో పాటు ఆధ్యాత్మికత అవసరమని, మానవులు ఎలా జీవించాలనేది మన సనాతన ధర్మం బోధిస్తుందని మళయాళస్వామి భక్తురాలు, బహు గ్రంథ రచయిత బొప్పన అరుణాదేవి అన్నారు. 98వ సనాతన వేదాంత జ్ఞానసభలో మంగళవారం రెండోరోజు జరిగిన మహిళల సభలో పలువురు మాతాజీలు ఆధ్యాత్మిక సందేశాలను వినిపించారు. భగవద్గీత సామూహిక పఠనం చేశారు. అనంతరం అరుణాదేవి మాట్లాడుతూ.. మహిళలకు ఆధ్యాత్మికం, ఆత్మగౌరవం, భావ ప్రకటన స్వేచ్ఛ కల్పించాలనే ఉద్దేశంతో సుమారు తొంభైఏనిమిది సంవత్సరాల క్రితమే మళయాళస్వామి స్త్రీల సభకు రూపకల్పన చేశారని వివరించారు. నాటి నుంచి నేటి వరకు ఈ పద్ధతి కొనసాగుతోందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో పరిస్థితులు మారాయని, స్త్రీలు ఉన్న విద్యావంతులుగా ఎదుగుతున్నారని అయితే తమ మూలాలను మర్చిపోకూడదని సూచించారు. మహిళ విద్యావంతురాలైతే ఆ కుటుంబం వెలుగుతుంది కానీ నేడు ఎక్కువ శాతం పాశ్చాత్య ధోరణులకు అలవాటుపడుతున్నారన్నారు. తల్లిదండ్రులే పిల్లలకు రోల్ మోడల్స్ అని పిల్లలను తీర్చిదిద్దడంలో వారి పాత్ర ఎనలేనిదన్నారు. అందువల్ల పిల్లల పెంపకంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మన సనాతన ధర్మాలను రాబోయే తరాలకు అందజేయాలంటే వారికి సంస్కారాన్ని ఇవ్వాలన్నారు. పిల్లలకు చిన్ననాటి నుంచి మన సంస్కృతి, విధానాలు, ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందింపచేయాలని చెప్పారు. ఈ సందర్భంగా సభలో పాల్గొన్న ఆధ్యాత్మిక వక్త కొంపెల్ల మాధవీలతను సత్కరించి శక్తిరూపిణిగా అభివర్ణిస్తూ అరుణాదేవి తదితరులు త్రిశూలం అందజేశారు. సభ వద్ద వ్యాసాశ్రమ పీఠాధిపతి శ్రీ పరిపూర్ణానందస్వామి ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద గుప్తాను జ్ఞాపికతో సన్మానించారు. కాగా అంతకు ముందు ఉదయం బ్రహ్మశ్రీ ఎం.రాజేశ్వరశర్మ ఆయుష్ హోమం నిర్వహించారు.




### మద్యం పట్టివేత


పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు

ఆమనగల్లు: కిరాణాషాపులో మద్యం విక్రయించేందుకు తీసుకువెళుతుండగా మంగళవారం ఆమనగల్లు పోలీసులు పట్టుకున్నారు. 11.5 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టు చేశారు. ఆమనగల్లు ఎస్‌ఐ బాల్‌రాం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తలకొండపల్లి మండలం వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన ఎండీ హస్రఫ్ కిరణాషాపు నిర్వహిస్తుంటాడు. ఈ క్రమంలో ఆషాపులో మద్యం విక్రయించే నిమిత్తం పట్టణంలోని వైన్‌షాపులో కొనుగోలు చేసి ఆటోలో తీసుకువెళుతుండగా చింతలపల్లి గ్రామ సమీపంలో చేపట్టిన సోదాలో మద్యం పట్టుకున్నట్లు ఎస్‌ఐ బాల్‌రాం తెలిపారు. మొత్తం 11.5 లీటర్ల క్వార్టర్, ఫుల్ బాటిళ్లు పట్టుకుని సీజ్ చేశారని ఆయన పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### చేపల వేటకు వెళ్లి.. యువకుడి మృతి


రమేశ్ (ఫైల్)

షాద్‌నగర్ రూరల్: చేపల వేటకు వెళ్లిన యువకుడు నీటిలో మునిగి మృతి చెందిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. ఈ ఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెలిజర్ల గ్రామ పంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది. గ్రామ స్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామపంచాయతీ పరిధిలోని ఏనెగడ్డతండాకు చెందిన రమేశ్(30) కూలీ పనులుచేస్తూ నివసించేవాడు. సోమవారం గ్రామ శివారులోని తాళ్ల చెరువులో చేపల వేటకని వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో చెరువులోకి దిగాడు. అతనికి ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు.ఈ క్రమంలో అతను ఆరోజు రాత్రి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చెరువు సమీపంలో వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తాళ్లచెరువులో దిగి గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహం కొక్కానికి తగలడంతో ఒడ్డుకు లాగారు.అక్కడ వారు రమేశ్ మృతి చెందినట్లు గుర్తించారు. ఘటనా స్థలంలో మృతుని కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

# బొంగ్లూర్ చోరీ కేసులో ట్విస్ట్

- 28 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారంటూ మరోసారి ఫిర్యాదు


సత్యం బాధితుడు

ఇబ్రహీంపట్నం రూరల్: కర్మకాండకు వెళ్లి వచ్చే సరికి ఇల్లు గుల్లయిన కేసులో కొత్త అంశం తెర మీదకు వచ్చింది. ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొంగ్లూర్‌లో ఈ నెల 18న జరిగిన చోరీలో ఏకంగా 28 తులాల బంగారు ఆభరణాలు దోచుకెళ్లినట్లు బాధితులు మొర పెట్టుకున్నారు. గతంలో 16 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు యజమాని యాదగిరి ఫిర్యాదు చేశారు. కానీ వాస్తవానికి యాదగిరి, ఆయన భార్య, కుమారుడు, కోడలుకు సంబంధించి 28 తులాల బంగారు ఆభరణాలు అపహరించినట్లు బాధితుడి సోదరుడు సత్యం మీడియా ముందు మంగళవారం వాపోయా రు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ.. ఈ నెల 16న తల్లి అంత్యక్రియలకు యాదగిరి కుటుంబ సభ్యులందరూ వెళ్లారన్నా రు. వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలు బొంగ్లూర్ రాఘవేంద్ర హోమ్స్‌లోని నివాసంలో బీరువాలో పెట్టారన్నారు. 18వ తేదీన ఇంటి తాళాలు పగలగొట్టి 16 తులాల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. కానీ వాస్తవానికి పోయింది 28 తులాలని బాధితులు తెలిపారు. నాలుగైదు రోజులుగా ఇదే విషయాన్ని చెబుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. తెలిసిన నాయకులతో పైరవీలు చేయిస్తే మరోసారి వివరాలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇచ్చారన్నారు.

> **పూర్తి వివరాలు సేకరిస్తున్నాం**
>
> దొంగతనం కేసును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. సంఘటనకు సంబంధించిన ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. ఇప్పటికే ఘటన వద్ద రూ.1.75 లక్షలు లభ్యమయ్యాయి. బంగారు ఎక్కువ మొత్తంలో చోరీ అయినట్లు ఆరోపిస్తున్నారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి దొంగలను పట్టుకునే ప్రయత్నం చేస్తాం.
>
> – రాఘవేందర్‌రెడ్డి, సీఐ, ఆదిబట్ల

# యాత్ర ముగిసింది.. పాత్ర మిగిలింది


క్యాంపులో కాంగ్రెస్ మహిళా ప్రజాప్రతినిధులు


మాజీ మంత్రి కేటీఆర్‌తో బీఆర్‌ఎస్ నేతలు

- ఒక్కో ఓటుకు.. ఒక్కో రేటు
- ఓటు ఎవరికో.. రూటు ఎటువైపో
- గోవా నుంచి ప్రజాప్రతినిధుల తిరుగు ప్రయాణం
- ఎమ్మెల్సీ ఉపఎన్నికకు అంతా సంసిద్ధం

షాద్‌నగర్: సరదా సరదాగా.. సందడిగా సాగిన ప్రజాప్రతినిధుల గోవా ట్రిప్ ముగిసింది. ఎమ్మెల్సీ ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో నేతలు తిరుగు ప్రయాణమయ్యారు. యాత్ర అయితే ముగిసింది కానీ ఇక అసలు పాత్ర మిగిలింది. అదే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజాప్రతినిధులు పోషించాల్సిన కీలక పాత్ర.. మరి ఈ పాత్ర పోషణలో ప్రజాప్రతినిధుల రూటు ఎటు వైపో.. ఓటు ఎవరికో అన్నది ముందున్న ప్రశ్న. ప్రజాప్రతినిధులు నేతలు చేజారిపోకుండా బరిలో ఉన్న అభ్యర్థులు నేతలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. ఎమ్మెల్సీ ఉపఎన్నిక పరిస్థితిని పరిశీలిస్తే..

**ముగిసిన గోవా యాత్ర**

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి కాంగ్రెస్ నుంచి పారిశ్రామికవేత్త మన్నె జీవన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా సుదర్శన్‌గౌడ్‌లు బరిలో నిలిచారు. అయితే ప్రధాన పార్టీలకు చెందిన ఇద్దరు అభ్యర్థులు షాద్‌నగర్‌కు చెందిన ప్రజాప్రతినిధులను క్యాంపు కోసం గోవా తీసుకెళ్లారు. క్యాంపులకు వెళ్లిన నేతలందరూ తిరుగు ప్రయాణమయ్యారు. ఈనెల 28న పోలింగ్ ఉండటంతో చేవేళ్ళ, మొయినాబాద్ తదితర ప్రాంతాల్లో ఉండే ఫాంహౌస్‌లు, రిసార్టుల్లో నేతలతో క్యాంపులు ఏర్పాటు చేసినట్లు సమాచారం.

**భారీ తాయిలాలు**

విందు రాజకీయాలతో పాటుగా ప్రజాప్రతినిధులతో బేరసారాలు ఊపందుకున్నట్లు తెలుస్తోంది. ఒక్కో ఓటుకు ఒక్కో రేటు పలుకుతుండగా, భారీ ఎత్తున తాయిలాలు, ఆఫర్లతో ఓటర్లను ఆకట్టుకుంటున్నట్లు సమాచారం. ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించే నేతలకు పెద్ద మొత్తంలో డబ్బులు అందిస్తున్నట్లు సమాచారం. ఇరు పార్టీలోనూ ఇప్పటికే మాట్లాడుతున్న విషయం ప్రకారం ఓటర్లకు కొంత నగదును అందజేయగా మిగితా మొత్తాన్ని పోలింగ్ రోజు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది. ఒక పార్టీ వారు ఇంత ఇస్తామని చెబుతుంటే దానికంటే అదనంగా ఇస్తామని మరో పార్టీ వారు చెబుతూ ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు నేతలు పాట్లు పడుతున్నారు. ఓటర్లు పక్కదారి పట్టకుండా పార్టీ నేతలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**కేటీఆర్ దిశానిర్దేశం**

గోవాకు మాజీ మంత్రి కేటీఆర్ వెళ్లారు. స్థానిక నేతలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికలో గెలుపునకు అనుసరించాల్సిన వ్యూహాలు, ఓటు వేసే విధానంపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు. మెజార్టీ తమకే ఉండటంతో సిట్టింగ్ స్థానాన్ని వదులుకోవద్దని, నేతలను చేజారకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఉప పోరుపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు బాధ్యతను స్థానిక ఎమ్మెల్యేలకు అప్పగించారు. పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో అభ్యర్థుల్లో ఆందోళన పెరుగుతోంది. ఉపఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలని కాంగ్రెస్ పట్టుదలతో ఉండగా, తమ పార్టీ నేతలు చేజారకుండా ఉండేందుకు బీఆర్‌ఎస్ నేతలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.